నుదుటన్ వ్రాసిన వ్రాలు—

దడిగాడు వానసిరా

ఆరణాల్నర లేకపోతే అర్ధరూపాయకు దొరికే కొబ్బరికాయకు ముక్కూ చెవులూదిద్ది బొట్టూ కాటుకా పెట్టి. ఒక రవిక గుడ్డచుట్టి దానినో మరచెంబులో దూర్చి పూజలుచేసి మంగళహారతులిచ్చి నంత మాత్రాన ఆ వరలక్ష్మిదేవి కోరిన వరాలిచ్చేస్తే — ఆ వేళ మధ్యాహ్నం బాడ్మింటన్ ఆడొచ్చి గుండెలో నొప్పిగా వుందని కాసిని మంచి నీళ్ళు పట్రమ్మని తెచ్చేలోగా సోడా తాగి మంచం మీద నడుంవాల్చి మరి

పక్కమీదనుంచి లేవకుండానే మా కమలక్క మాంగళ్యాన్నికూడా
పట్టుకుపోయిన మా బావగారు. సిమెంటు ప్యాక్టరీలో నాలుగొందల
జీతగాడు పండంటి సంసారాన్ని. పసిపిల్లల్నీ ఇల్లూవాకిలీ వదిలిచెప్ప
కుండా చెయ్యకుండా వెళ్ళిపోయినవారు మా కమలక్క ఏడ్చిన ఏడుపు
ఆ దిక్కుమాలిన కొబ్బరికాయను మింగికూర్చున్న దేవతకు వినపడ
లేదా — సావిత్రీ గౌరీదేవిని కొల్చిందే — బొమ్మల నోము లన్నీ
నోచిందే — గుళ్ళూ గోపురాలన్నీ సేవించిందే — ఏ దేవతా కటా
క్షించలేదే ఏ అమ్మవారూ గుళ్ళోంచి అభయహస్తం చూపించలేదే
ఏ పానకాలస్వామి, ఏ రామచంద్రుడూ ఏ వెంకటేశ్వరస్వామీ
మా కమలక్క తాడు తెగినపుడు ఇన్నిపూజలూ ముడుపులూ మింగి
కూర్చున్న ఒక్క దేవుడూ పలకలేదే? పలకలేరు పలకరు. పలక్క
పోతే దానిపిల్లలేమైపోతారు? ముప్పయేళ్ళు రాకుండా ముండ మోసిన
మా కమలక్క బ్రతుకు నట్టేట్లో కలిసింది. దాని ముద్దూ ముచ్చట. నల్ల
పూసలసౌరూ అన్నీ గంగలో కలిశాయి. మాకమలక్క నోచిన నోము
లన్నీ చేసిన వ్రతాలన్నీ దాని మొగుడ్ని ముప్పయిఅయిదేళ్ళకే కాట్లోకి
చేర్చి దాని బ్రతుకు దుంపనాశనం చేశాయి. అందుకని ఈ దొంగముండా
దేముళ్ళని ఈ వ్రతాల్నీ. నోముల్నీ చూస్తే నా కరికాలిమంటనెత్తి కెక్కు
తుంది. మాకమలక్క ఎంతహాయిగా పాడేది తరంగాలూ కృతులూ —
పచ్చగా మిసమిసలాడిపోయే ఒంటిమీద కంచి పట్టుచీరకాని, ముదురు
నీలం, కెంపు, వయొలెట్ రంగు జరీచీరలు కట్టుకున్నపుడు ఆమె కుచ్చెళ్ళు,
పారాణిరాసినట్లు నడిస్తే కందిపోయే ఆమెపాదాలకేసి అదేపని చూడబుద్ధ
యేదినాకు. మా కమలక్క జడ ఆమె నడుస్తూంటే బిరిమీద త్రాచులా
పెద్దపొగరు మోతుగా బుసలు కొడుతున్నట్లు విసవిసలాడేది. బంగారాన్ని
ఉలిపర కాయితంలో చుడితే మురిపించి మెరిపించినట్లు పల్చటి చీరతో
ఆమె నడుము బుజాల ఒంపులు, మెడ, పాదాలు కొట్టచ్చినట్లు కనబడేవి.

మా కమలక్క ఏ పెళ్ళి పందిట్లో అయినా ఎవరికో జడలు వేస్తూ, పేశా కోళాలాడుతూ ఆ పనీ ఈ పనీ కలిపించుకుని ఎంతచాకిరీ అయినా అవలీలగా చెట్టేస్తూ సంతోషంగా వూహించుకోవచ్చు. అటువంటిచిరంజీవి సౌభాగ్యవతి పంపుదగ్గర బట్టలుతుకుతూ, అంటగిన్నెలుతోముకుంటూ మాసినచీరలు కట్టుకుని, పిట్టొచ్చి వడిపోయినా మందూ మాకూలేకుండా కసితో శరీరాన్ని నానా హింసలపాలూ చేసుకుంటూ ఏడుస్తూ జీవించడం చూస్తోంటే ఈ గుళ్ళన్నీ ఆటంబాంబు లెట్టిపేల్చేసి ఈ దేవుళ్ళ నందర్నీ సముద్రంలో గిరవాటు పెట్టెయ్యాలని నా కనిపిస్తూవుంటుంది. కాని మా కమలక్క పిచ్చిది. స్నానాలుమీద స్నానాలుచేస్తూ వుంటుంది. గుళ్ళోకెళ్ళి పురాణాలు వింటుంది. ప్రతి ఏకాదశికీ తన దేవుడు పెట్టెలోని ప్రతి దేవుణ్ణి చింతపండుతో తోమిధగధగా మెరిసిపోయేలా తుడిచి అలంకరించి చూసుకుని ఆనందిస్తూ వుంటుంది. మా కమలక్క ఒకప్పుడు పూమొక్కలా నవ మోహనంగా నవ్వులరాణీలా వుండేది. ఇప్పుడామె నడుస్తున్న శవం. ఆమెనవ్వితే చేతులు రెండూజోడిస్తే డబ్బు అప్పివ్వమని అడిగితే— ఉపోషాలుచేస్తే. పిల్లలకు చచ్చిపోయినతండ్రి పంట్లాములు చింపి కుడితే, ఆయనలుంగీలు పంచలుచింపి చొక్కాలు పిల్లలకు చేత్తో సూదీ దారం తీసుకునికుడితే గోడమీద రాధతో ఉయ్యాల లూగుతున్న కృష్ణుడు పట్టాభిషేకం హడావిడిలో మునిగిపోయిన శ్రీ సీతారామలక్ష్మణ భరత శత్రుఘ్న పరివేష్టిత ఆంజనేయ సమేతులు, అంగనామంగనా మంతరే మాధవం అంటూ ఒకొక్క ఆడదానిమధ్య అవతరించిన మాధవుడూ మేనకను త్రోసిపుచ్చుతున్న విశ్వామిత్రుడూ, వెంకటేశ్వరస్వామి అలివేలు మంగతాయారూ వెండి కొండలమీద పార్వతీ సమేతుడై హసృన్న ఈశ్వరుడూ యింతమందీ ఏమీ ఎరగనట్టు మా కమలక్కజీవితం కాలిపోతుంటే చూస్తూ వూరుకున్నారుకాని ఎన్నో ఎంతమందినో కాచిన బ్రోచిన ఈ గాడ్సంతా మా "కమలక్క" కి అడ్డుపడలేదే. అది ఆ దేవుళ్ళని

యింకా కొలుస్తూనేవుంటుంది. పచ్చితల్లి లేకపోతే నాశనంచేసిపారేస్తారట దానిపిల్లల్ని మింగేస్తారట దేవుళ్ళకి కోపంరానివ్వ కూడదట. వీళ్ళ అమ్మకడుపుమాడ. వీళ్ళకి కోపంవస్తే రానివ్వవే అక్కా ఇంతకంటే నిన్నేమిచేయగలరు — ముప్ఫయ్యేళ్ళ మసలివానివి నీజీవితంముక్కలూ చెక్కలూచేసి పంచుకుతినడం ఆ దేవుళ్ళందరికీ ఇష్టమయితే వాళ్ళ ఆకలి చల్లారనీ — నీవు. నోచిన నోములు వాళ్ళకు నచ్చలేదే. నీపూజలు వాళ్ళమీద పనిచేయలేదే నీ కీర్తనలు వుపోషాలు ఆ దేవుళ్ళను కరిగింప గలిగితే బ్యాడ్ మింటన్ ఆడొచ్చి మంచినీళ్ళడిగిన నీ మొగుడు నీ చేతనీళ్ళు తాగకుండానే హరీమని ఎందుకంటాడు?

కమలక్కా ఫర్ గాడ్సే సేక్ పూజలూ పునస్కారాలూ మానేసి ఆ డబ్బు సేవ్ చేసి కాసిని పాలుకొని తోదెట్టి ఇంతమజ్జిగ చిక్కగా పొయ్యేవాళ్ళకి అన్నంలో. మొహాల్లోకి కాస్త జీవం తొంగి చూస్తుంది పిల్లలికి.

కొండెక్కా దేవుళ్ళకి కొబ్బరికాయలుకొట్టడం మానెయ్ ఆ ఏడు కొండలవాడికి బ్లాక్ మార్కెటీర్లూ సినిమాస్టారులంటే ఇష్టం నీలాంటి నాలాటి లాకాయిలూకాయి గాళ్ళంటే ఆ దేవుడికి ఖాతర్లేదే —

బిజినెస్ మనకీ మంత్రులకేగాని మనలాటి ఎటిసెట్రాగాళ్ళకు తీర్థ ప్రసాదాలూ కటాక్షవీక్షణాలూ వుండవేబాబూ. జుట్టును పిగులుచేసి అమెరికాకు అమ్ముకునే దేవుళ్ళనుంచి దయాదాక్షిణ్యాలను అపేక్షించడం షీర్‌నాన్సెన్స్. ఈనాట్సెకికూడా మన టూలర్స్‌కిమల్లే దరిద్రులను కాల్చుకుతినడం హాబీ—కమలక్కా— ఈ వేళ నీబ్రతుకు తల్చుకుంటే నా కేమిటో ఆక్రోశంవచ్చేసిందే. జెరూసెలెంలో ఆక్రోశకుడ్యమని ఏడవటానికి ఓ గోడ కట్టేరుట. ఆ గోడవగ్గరకువెళ్ళి ఏడిస్తేమనశ్శాంతి లభిస్తుందట. అలాటిగోడలు మనకిఎన్నో కావాలే. పోనీ అక్కడకువెళ్ళి ఏడుద్దా

మంటే - జెరూస్లెం ఇక్కడుందనుకున్నావా? ఏవిటి మన కంకిపాడు దగ్గరా, మాచవరం దగ్గిరానూ. అయితే కమలక్కా మన బ్రతుకులు తల్చుకుంటే ఏ గోడకేసి తిరిగి నా ఇంట్లో ఏడుపొచ్చేస్తుందే. మరిమనం వేరే ఎక్కడికీ వెళ్ళనక్కర్లేదే — నాకు తెలుసులేవే — రోగం వస్తే మందు పుచ్చుకోవు. చావుకోసం ఎదురు చూస్తూ కాలిపోతూన్న వత్తిలా అయిపోదా మనుకుంటున్నావు కదూ! అందుకే ఎటుచూస్తే అటు చీకటి — చేమవిషం జీవఫలం అన్నాడే కవిగారు. ఏదిగారువానసిరా కాదే —

కమలక్కా నీ జుట్టంతా రాలిపోతోందేంటే!

బుసలుకొట్టిన తాచుపాములావుండిన నీ జడ ఇల్లుకడిగి తుడుచుకునేందుకు వాడే మురికి చీపురులాగ ఎలాగయిందే చెప్మా? కమలక్కా —

తరుణారుణ శోభలతో విరిసిన వెన్నెల కావలసిన నీ జీవితం కొడిగట్టిన దీపం ఎలాగయిందో తల్చుకుంటే నాకు ఏడుపు ఆగటంలేదే — ఏ గోడచాటుకైనా వెళ్ళి నిలబడి బోరున దుఃఖభారం దించేసుకోవాలి! అక్కా.... అక్కా....